# శ్రీతన్య



ఎల్.డి.సిగా పని చేస్తున్న రాజారావు ఈ మధ్యనే రిటైర్ అయ్యాడు. ఆయనకు ముగ్గురు కూతుర్లు. తను ఉద్యోగంలో ఉండగానే కనీసం ఇద్దరు పిల్లలకన్నా పెళ్ళి చేయాలన్నది అతని కోరిక. దురదృష్ట వశాత్తు ఆ కోరిక తీరకుండానే రిటైర్ అయ్యాడు.

గత కొన్నేళ్ళుగా పెళ్ళి ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాడు రాజారావు. పెళ్ళి సంబంధాలు వస్తున్నాయి, పోతున్నాయి, వాళ్ళకు స్వీట్లు, వగైరాలకు డబ్బు మాత్రం నీళ్ళ ప్రాయంగా ఖర్చు పెడుతున్నాడు. కాని ప్రయోజనమేమీ లేదు. వాళ్ళు అడిగే లక్షల కొద్ది కట్నాలు, లాంఛనాలు, ఇచ్చుకొనే ఆర్థిక స్థోమత లేక అచేతనుడై పోయాడు.

ఇప్పుడు తను ఊహిస్తున్నది. నేను చచ్చేలోగా ఒక్క పిల్లకైనా పెళ్ళి చేయగలనా లేదా? అని ఆశ నిరాశల మధ్య కొట్టు మిట్టాడుతున్న రాజారావుకు అప్పుడే ఒక ఉత్తరం వచ్చింది. రాజారావు ఆ ఉత్తరాన్ని చించి చదవసాగాడు. ఒక్కో అక్షరం చదువుతున్న కొద్ది అతని ఆనందానికి అంతు లేక పోయింది.

ఇన్నేళ్ళకైనా ఓ కూతురి పెళ్ళి జరగబోతుంది అని ఎంతో సంబర పడిపోతూ ఆ విషయాన్ని భార్య సరోజతో చెప్పాడు. "మన పెద్దమ్మాయిని చూట్టానికి క్రిష్ణమూర్తి గారి అబ్బాయి వస్తున్నాడు. ఆ అబ్బాయి మన అమ్మాయిని ఒప్పేసుకుంటే పైస కట్నం లేకుండా పెళ్ళి చేసుకుంటామని ఉత్తరం వ్రాశాడు" అని ఎంతో సంతోషంతో చెప్పాడు రాజారావు.

సరోజమ్మ ఆ విషయాన్ని విని ఎంతగానో ఆనందించింది. "బంధువులు కన్నా స్నేహితులు మిన్నండి. చిన్న నాటి మీ స్నేహం ఇప్పుడు బంధుత్వంగా మారి పోతుంటే అది కలో, నిజమో అని ఇప్పటికీ నాకు ఆశ్చర్యంగా ఉంది" అంది ఆనందంతో.

"క్రిష్ణమూర్తి అంటే ఏమనుకున్నావే! వాడు మంచి భావాలు కల్గినవాడు. మనిషికి, మంచికి విలువ ఇస్తాడు కాని డబ్బుకు మాత్రం విలువ ఇవ్వడు. ఇన్నాళ్ళు నేను వాడి సంగతే మర్చిపోయాను. నేనే వెళ్ళి ఓరే మా అమ్మాయికి, మీ అబ్బాయికి పెళ్ళి చేద్దాంరా అని ఎప్పుడో అడగాల్సిన మాట. ఈ పని అప్పుడే చేసి ఉండి వుంటే అమ్మాయి పెళ్ళి ఎప్పుడో జరిగి పోయి ఉండేది. ఇప్పుడైనా మించింది లేదు. క్రిష్ణమూర్తిని అడిగి త్వరలోనే ముహుర్తాలు నిర్ణయిస్తాను. అన్నట్టు అబ్బాయి రేపో, మాపో వచ్చేస్తాడు. నేను వెళ్ళి వంట సామాగ్రిని తెస్తాను." అంటూ బజారు ముఖం పట్టాడు రాజారావు.

ఆ మరుసటి దినమే వచ్చాడు క్రిష్ణమూర్తి కొడుకు ప్రసాద్. అతడు ఇంటికి రాగానే నిజంగా తమ ఇంటికి కొత్తల్లుడు వచ్చినాడన్నంత ఆర్భాటంతో

# నవ్వింది!

- బి. వెంకటేశ్వర్లు



ప్రసాద్‌కి సకల మర్యాదలు చేశారు.

పెద్దమ్మాయి శ్రీకన్యను అతడు చూడాలని, ఆమెతో మనసు విప్పి మాట్లాడాలని వారిద్దర్ని ఏకాంతంగా వదిలి ఒకరికి తెలియకుండా ఒకరు ఏదో ఒక వంక పెట్టుకొని పని ఉన్నట్లుగా పక్కింటికో, ఎదురింటికో వెళ్ళేవారు. ప్రసాద్ వంటరిగా బయటికి వెళ్తే "బాబు నువ్వు ఊరికి కొత్త, తోడుకు శ్రీకన్యను తీసుకెళ్ళు" అని సరోజమ్మ కూతుర్ని ప్రసాద్ వెంట పంపేది. వారిద్దరు కలిసి జంటగా వెళుతుంటే తల్లి, చెల్లెళ్ళు చూసి ఎంతో మురిసి పోయే వారు. సరోజమ్మ అయితే వారిద్దర్ని దంపతులుగా ఊహించుకొని ఎన్నెన్నో కలలు కనేదీ. ఆ కలల్లో ముఖ్యంగా– నేను, మా ఆయన త్వరగా అవ్వ, తాతలమై పోవాలి అనుకొనేది.

రెండు రోజులు తర్వాత ప్రసాద్ ఊరికి బయలుదేరుతుంటే అందరూ అదోలా ఉన్నారు. శ్రీకన్య కైతే కళ్ళు చెమర్చాయి.

"వెళ్ళొస్తానండి" అంటూ అందరితో చెప్పి వెళ్ళిపోయాడు ప్రసాద్. వెంట రాజారావు కూడా వెళ్తూ "బాబు అమ్మాయి విష...." అంటూ అర్థోక్తిలో ఆగిపోయాడు రాజారావు.

"ఊరెళ్ళగానే ఉత్తరం వ్రాస్తాను" అన్నాడు ప్రసాద్.

పది రోజులు తర్వాత రాజారావు ఇంటికి ఉత్తరం వచ్చింది. ఆ ఉత్తరాన్ని ముందుగా నేను చదవాలి. నేను చదవాలి అని మనసులోనే ఆరాట పడుతున్నారు. రాజారావే ఆ ఉత్తరాన్ని చించి అందరూ వినేట్టుగా గట్టిగా చదవ సాగాడు.

రాజారావు గారికి!

నేను మీ ఇంటికి వచ్చింది మీ అమ్మాయిని చూడ్డానికి కాదు. ముఖ్యంగా కోర్టు వ్యవహారంపై అక్కడికి వచ్చాను. నేను వచ్చిన పని సక్సస్ అయ్యింది. కాని మా నాన్న ఈ విషయంలో చాలా తప్పుగా ప్రవర్తించాడు. భోజనం, లాడ్జింగ్ ఖర్చులు మిగిలి పోతాయనే దురుద్దేశంతో మీకు ఉత్తరం అలా వ్రాశాడు. మా నాన్న పట్టి డబ్బు మనిషి. నాకు రాక, పోకల చార్జీ మినహా పైసా కూడ ఇవ్వలేదు. అందుకోసం మీ ఇంటికి రాక తప్పలేదు. మా నాన్న తరుపున 'క్షమాపణ' వేడుకొంటున్నాను.

ఇంకో విషయం. కోర్టులో నా కేసు వాదించి గెలిపించిన లాయర్ గారి కూతురుతో నా వివాహం మా నాన్న నిశ్చయం చేశాడు. త్వరలో నే లగ్న పత్రిక పంపుతాను. మీరు తప్పకుండా రావాలని మరి, మరి కోరుకుంటున్నాను.

ఇట్లు,

ప్రసాద్.

ఆ సారాంశాన్ని విన్న అందరూ నిశ్చేష్టులై పోయారు. శ్రీకన్య మాత్రం గట్టిగా నవ్వ సాగింది. తెరలు, తెరలుగా నవ్వసాగింది.